

సిరుల 'చామంతి'

మోమిన్‌పేట మండల పరిధిలో చామంతి పూల సాగు చేపట్టిన రైతు ఇంట లాభాల పంట పండుతోంది. 8లో▸



కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

రహదారుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తుంటే.. వీటి నిర్వహణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. 8లో▸



నిధులు లేవు.. గౌరవం లేదు

'పేరుపెద్ద.. ఊరుదిబ్బ' అనేలా మారింది మా పరిస్థితి. మాకంటూ నిధులు లేక లీడర్లుగా జనంలో తిరగలేక పోతున్నాం. 9లో▸

వివక్షపై విద్యార్థుల కన్నెర్ర



పెద్దేముల్ మండలం గొట్లపల్లి ఆదర్శ పాఠశాల ఎదుట బైఠాయించిన విద్యార్థులు

- గొట్లపల్లి మోడల్ స్కూల్ వద్ద కుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా
- ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్

పెద్దేముల్: ప్రిన్సిపాల్ గాయత్రి తమపై కులవివక్ష చూపుతున్నారని, వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని కోరుతూ మంగళవారం పెద్దేముల్ మండల పరిధిలోని గొట్లపల్లి మోడల్ పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. సుమారు గంటపాటు తాండూరు– జహీరాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రిన్సిపాల్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. గోట్లపల్లి శివారులో తెలంగాణ ఆదర్శ మోడల్ స్కూల్‌లో 414 మంది విద్యార్థులకు గాను 17 మంది ఉపాధ్యాయులు, నలుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. కొంతకాలంగా ప్రిన్సిపాల్ గాయత్రి, ఔట్ సోర్సింగ్ సిబ్బంది మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. తమను ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇటీవల ఆందోళనకు దిగారు. ఈ విషయాన్ని మర్చిపోకముందే విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ కులవివక్ష చూపుతున్నారని, ఆమెను విధుల నుంచి తొలగించాలని రోడ్డెక్కారు. కుల, విద్యార్థి సంఘాల నాయకులు వీరికి మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ పాఠశాల వద్దకు వెళ్లి మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సముదాయించడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కాగా, కుల వివక్ష చూపిస్తున్న ప్రిన్సిపాల్ గాయత్రిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నేతలు దీపక్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు వెంటనే స్పందించాలని లేదంటే జిల్లా వ్యాప్త నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వివక్షను ఉపేక్షించేది లేదన్నారు.

న్యూస్‌రీల్

డీసీఆర్‌బీ డీఎస్పీగా జగన్



ఎస్పీ కోటిరెడ్డిని కలిసిన డీసీఆర్‌బీ డీఎస్పీ జగన్

అనంతగిరి: డీసీఆర్‌బీ డీఎస్పీగా జి.జగన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి ఇక్కడకు వచ్చారు. మర్యాదపూర్వకంగా ఎస్పీ కోటిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఏఎస్పీ రషీద్ ఉన్నారు.

అన్ని రకాల మొక్కలు పెంచాలి

- క్రీడాప్రాంగణాల ఏర్పాటులో నిర్లక్ష్యం తగదు
- డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్



బసిరెడ్డిపల్లి నర్సరీని పరిశీలిస్తున్న పీడీ కృష్ణన్

పరిగి: పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉంచాలని డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్ సూచించారు. మండల పరిధిలోని రంగాపూర్, బసిరెడ్డిపల్లి గ్రామల్లోని నర్సరీలు, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలకు నీటిని అందించాలని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తోందన్నారు. కానీ ఇప్పటికీ చాలా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తి కాలేదని, త్వరలోనే పనులు ప్రారంభించాలని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీడీ వెంట ఎంపీపీ అరవింద్ రావు, ఎంపీడీఓ శేషగిరిశర్మ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సునీతారెడ్డి

అనంతగిరి: క్రీడల్లో గెలుపోటములు సహజమని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం వికారాబాద్‌లోని భృంగీ స్కూల్‌లో నిర్వహించిన క్రీడాపోటీలను ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరకదారుఢ్యం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, మాజీమంత్రి డాక్టర్ చంద్రశేఖర్, కార్యదర్శి ప్రమీల, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, డైరెక్టర్ కుమారస్వామి, కౌన్సిలర్ శ్రీదేవి, ధారూర్ పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లం బిల్లులేవీ?

పరిగి మండల పరిధిలోని చిట్యాల్ గ్రామానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద 16 కల్లాలు మంజూరయ్యాయి. గతేడాది ఆరుగురు రైతులు రూ.85 వేల చొప్పున సొంత డబ్బులు ఖర్చు చేసి కల్లాలు నిర్మించుకున్నారు. మిగతా రైతుల చేతిలో డబ్బులు లేకపోవడంతో వేచిచూశారు. అయితే కల్లాలు నిర్మించుకున్న ఆరుగురిలో ఒక్కరికి కూడా ఇప్పటివరకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు మించి బిల్లులు రాలేదు. దీంతో మిగిలిన రైతులు నిర్మాణానికి సాహసించలేదు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.



పరిగి మండలం రంగాపూర్‌లో ఓ రైతు నిర్మించిన కల్లం

నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా అందని బకాయిలు

- పలు చోట్ల అర్ధంతరంగా నిలిచిపోయిన పనులు
- ఆందోళనలో అన్నదాతలు

వికారాబాద్: పంట నూర్పిళ్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన కల్లాల నిర్మాణం పథకం అభాసుపాలవుతోంది. జిల్లాలకు మంజూరైన కల్లాలు వేల సంఖ్యలో ఉండగా.. పూర్తయినవి వందల్లోనే. రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కల్లాలు మంజూరు చేసింది. జిల్లావ్యాప్తంగా 3,261 కల్లాలు నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటి వరకు 230 మాత్రమే పూర్తయ్యాయి. మరో 500 నిర్మాణ దశలో ఉన్నాయి. ఒక్కో కల్లానికి రూ.85 వేలు చెల్లించాల్సి ఉండగా ఏ ఒక్క రైతుకు కూడా పూర్తి స్థాయిలో డబ్బులు వచ్చింది లేదు. దీంతో చాలా మంది రైతులు కల్లాలు నిర్మించడానికి ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో 2,531 కల్లాలు ప్రారంభం కాకుండానే ల్యాప్స్ అయ్యే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం సరైన నిబంధనలు పాటించడం లేదంటూ కేంద్రం చేతులెత్తేసింది. దీన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇటీవల ధర్నాలు, రాస్తారోకోలు చేయించింది. కానీ కల్లాలు నిర్మించిన రైతులు మాత్రం తమకు డబ్బులు వస్తాయో.. రావో? అని టెన్షన్ పడుతున్నారు.

రెండేళ్లుగా పెండింగ్..

గ్రామాల్లో రైతులు, రైతు కూలీలకు ఉపాధి గ్యారంటీ పేరుతో ప్రారంభించిన ఉపాధి హామీ పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం నెలకొంటోంది. చేసే పనులు ఏవైనా సకాలంలో బిల్లులు రావడం లేదు. ఇదే తరహాలో రెండేళ్ల క్రితం ఉపాధి హామీ ద్వారా రైతుల పొలాల వద్ద కల్లాలు నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించారు. ఒక్కో కల్లానికి రూ.85 వేలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందులో కొంత డబ్బులు మ్యాన్‌డేస్ (ఉపాధి పని రోజులు) ఆధారంగా మిగిలినవి మెటీరియల్ కాస్ట్ రూపంలో చెల్లిస్తామని అధికారులు తెలిపారు. కానీ రెండేళ్లు గడుస్తున్నా బిల్లుల చెల్లింపు ప్రస్తావనే లేదు. అధికారులు సైతం అన్నదాతల గోడు పట్టించుకోవడం లేదు.

జిల్లాకు మంజూరైనవి	:	3,261
నిర్మాణాలు పూర్తయినవి	:	230
ప్రోగ్రెస్‌లో ఉన్నవి	:	500
ల్యాప్స్ అయ్యే దశలో	:	2,531

బిల్లులు చేసి పంపించాం

జిల్లాకు కల్లాలు మంజూరైనా రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన వాటికి సంబంధించిన బిల్లులు చేసి పంపించాం. ప్రభుత్వం బిల్లులు విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో జమవుతాయి.

– కృష్ణన్, డీఆర్‌డీఏ పీడీ

తెలంగాణలో దినదినాభివృద్ధి

- మంత్రి సబితారెడ్డి
- చేవెళ్ల మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

చేవెళ్ల: తెలంగాణలో ఎంతో అభివృద్ధి జరుగుతోందని ఈ అభివృద్ధిని దేశావ్యాప్తం చేసేందుకు కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో చేవెళ్ల ప్రాంతం మరింతగా పురోభివృద్ధి సాధించి హైదరాబాద్‌లో కలిసిపోతుందన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి మంగళవారం చేవెళ్లలో రూ.60లక్షలతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన, రూ.15లక్షలతో ఇంద్రారెడ్డి మెమోరియల్ పల్లె ప్రకృతి వనం ప్రారంభం, రేగడిఘనాపూర్‌లో రూ.కోటితో బ్రిడ్జికి శంకుస్థాపన, సింగప్పగూడలో రూ.కోటితో బ్రిడ్జికి శంకుస్థాపన, రూ.37లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. షాబాద్‌లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చాయని మరికొన్ని కంపెనీలు రాబోతున్నాయని చెప్పారు. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో దేశం ఎంతో పురోగతి సాధిస్తోందని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. గతంతో పోలిస్తే తెలంగాణ వచ్చిన తరువాత గ్రామాలు ఎలా అభివృద్ధి చెందాయో ప్రజలకు బాగా తెలుసన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ మర్పల్లి మాలతి, వైస్ ఎంపీపీ కె.శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింలు, చేవెళ్ల, రేగడిఘనాపూర్, సింగప్పగూడ గ్రామాల సర్పంచులు బండారి శైజల, ఆర్.నర్సింలు, రహీమాబేగం, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు వాసవి, రవీందర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, శివారెడ్డి, మోహన్‌రెడ్డి, భీమయ్య పాల్గొన్నారు.



తాండూరులోని పాత లారీ పార్కింగ్ ప్రాంగణం

ఎన్నికా.. ఏకగ్రీవమా!

- లారీ అసోసియేషన్‌లో ఆధిపత్య పోరు
- రెండు గ్రూపులుగా విడిపోయిన యజమానుల సంఘం
- సీనియర్లు, జూనియర్లది చెరో దారి
- కొత్త అధ్యక్షుడి నియామకంపై ఉత్కంఠ
- ఏకగ్రీవం చేద్దామని ఓ వర్గం, ఎన్నికలు పెడుదామని మరో వర్గం

తాండూరు: భూగర్భ నిక్షేపాలైన నాపరాతి, సుద్ద, ఎర్రమట్టితో పాటు ఇసుక సంపదకు నెలవు తాండూరు నియోజకవర్గం. ఇక్కడ వెలిసిన సిమెంట్ ఫ్యాక్టరీలు నిత్యం వందలాది టన్నుల ఉత్పత్తులను సాధిస్తున్నాయి. వీటి రవాణాలో లారీలదే కీలక పాత్ర. స్థానికంగా ఉన్న సరుకును ట్రాన్స్‌పోర్ట్ చేసేందుకు వీటినే ఎక్కువగా వాడుతున్నారు. అయితే తాండూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ మధ్య ఇటీవల నెలకొన్న సమన్వయ లోపం యజమానులకు ఇబ్బందికరంగా మారింది. యూనియన్ అధ్యక్షుడిగా ఉన్న భగవాన్ కరీం నాలుగు నెలల క్రితం మరణించారు. అప్పటినుంచి ఈ సీటు ఖాళీగానే ఉంది. ఇటీవల చాలా మంది అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. ఈ విషయంలో ఏకమైన ఓ వర్గం సీనియర్లు.. అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని భావిస్తున్నారు. మరో వర్గం మాత్రం సభ్యులందరితో ఎన్నికలు నిర్వహించాలని చూస్తోంది. ప్రస్తుతం ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశమైంది. కరోనా లాక్‌డౌన్‌కు ముందు తాండూరు నియోజకవర్గంలో 800 పైగా లారీలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో యజమానులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. సుమారు 200 మంది కిస్తులు చెల్లించలేకపోవడంతో వీరి లారీలన్నీ ఫైనాన్షియర్ల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం అసోసియేషన్‌లో 600 లారీలు ఉండగా 400 మంది ఓనర్లున్నారు.

నాన్ లోకల్ లారీలకే ప్రాధాన్యం

తాండూరులో లారీ పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేస్తున్నారు. ఇదేమిటంటూ పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. పరిశ్రమలు, నాపరాతి పాలిషింగ్ యూనిట్ల నుంచి సరుకు రవాణా చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్‌లను ఆశ్రయించాలి.అయితే ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు లోకల్ లారీలకు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సరుకు తెచ్చిన వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కొంతకాలంగా ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు అనుసరిస్తున్న ఈ చర్యలను లారీ ఓనర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్‌లు నిర్వహిస్తున్న వారికి లారీలు ఉండటంతోనే ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారని లారీ ఓనర్లు చెబుతున్నారు. దీంతో లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయారు.

రెండు వర్గాల పోటీ

తాండూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో రెండు వర్గాలు అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నాయి. ఇందులో ఓ వర్గం సీనియర్లు అంతా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని భావించారు. మరో వర్గం మాత్రం ఇందుకు ససేమిరా అంటోంది. లారీ ఓనర్లకు కొత్తగా సభ్యత్వం అందించి ఆ తర్వాత ఎన్నికలకు వెళ్లాలని రెండో వర్గం డిమాండ్ చేస్తోంది. ఇందుకోసం లారీ యజమానుల వివరాలను సేకరించి గుర్తింపు కార్డులు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇరువర్గాల తరపున మాజీ కౌన్సిలర్ మహ్మద్ ఇర్ఫాన్, హకీం ఖాన్ అధ్యక్ష రేసులో ఉంటారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా నూతన కమిటీ నియామకం కోసం ఎన్నికలు నిర్వహిస్తారా..? ఏకగ్రీవం చేస్తారా అనేది ఉత్కంఠగా మారింది.

'అభయం' ఆగం



- ప్రభుత్వం వద్దే మూలుగుతున్న లబ్ధిదారుల సొమ్ము
- చెల్లించిన ప్రీమియం తిరిగివ్వని వైనం
- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న డ్వాక్రా మహిళలు

మోమిన్‌పేట: అభయ హస్తం పథకం లబ్ధిదారులు తాము చెల్లించిన డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 1,18,712 మంది 2013 వరకు ప్రీమియం చెల్లించారు. కానీ ఏళ్లు గడుస్తున్నా వీరి డబ్బులు తిరిగివ్వడం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వృద్ధాప్యంలో మహిళలకు అండగా నిలవాలనే సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో అభయహస్తం పథకాన్ని ప్రవేశ పెట్టారు. 18నుంచి 59 సంవత్సరాల లోపు వారు డ్వాక్రా సంఘాల్లో సభ్యత్వం తీసుకుని, అప్పట్లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. నిత్యం రూపాయి చొప్పున వీరు జమ చేస్తే ప్రభుత్వం సైతం తమ తరఫున రూపాయి జమ చేస్తుంది. సభ్యులు 60 ఏళ్లు దాటిన తర్వాత వారు చెల్లించిన మొత్తాన్ని ఆధారంగా చేసుకుని ప్రతినెలా రూ.500 నుంచి రూ.5 వేల వరకు పెన్షన్ అందించాలనేది ప్రధాన ఉద్దేశం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 1,18,712 మంది ఈ పథకంలో చేరారు. మూడేళ్లు సజావుగా సాగిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఏర్పడింది. అనంతరం లబ్ధిదారుల నుంచి ప్రీమియం డబ్బులు తీసుకోలేదు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 2,575 మంది మహిళలు అభయహస్తం పథకంలో సభ్యులుగా చేరారు. 2012– 13 మార్చి నాటికి 2,575 మంది లబ్ధిదారులు చెల్లించిన ప్రీమియం రూ.5 లక్షలకు పైగానే జమ ఉంది. చెల్లించిన ప్రీమియంను వడ్డీతో సహా ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వీరిలో కొంతమంది మృతి చెందారు.

ప్రభుత్వమే అందజేస్తున్న నేపథ్యంలో..

కేసీఆర్ సర్కార్ కొలువుదీరిన తర్వాత సామాజిక పెన్షన్ల మొత్తాన్ని భారీగా పెంచింది. దీంతో పథకం ద్వారా లబ్ధిదారుల నుంచి డబ్బులు సేకరించి, బ్యాంకుల్లో జమ చేసే ప్రక్రియ ఆగిపోయింది. ప్రభుత్వమే పింఛన్లు అందజేస్తున్న నేపథ్యంలో అభయహస్తం మరుగునపడిపోయింది.

ఆదేశాలు రాలేదు



అభయ హస్తం పథకం కింద లబ్ధిదారులు చెల్లించిన ప్రీమియం డబ్బులను తిరి గి చెల్లించాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అభయ హస్తం పథకంలో చేరిన వారందరికీ బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వారి అకౌంట్లలో తిరిగి జమచేస్తాం. మృతి చెందిన వారికి సంబంధించి నామినీల ఖాతాల్లో వేస్తాం.

– రాజు, ఐకేపీ ఏపీఎం, మోమిన్‌పేట

క్లుప్తంగా

9నుంచి క్రికెట్ పోటీలు

యాలాల: ఈ నెల 9నుంచి అన్నారం మాణెప్ప, డాక్టర్ ముఖేశ్‌ల జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీలో భాగంగా విజేత జట్టుకు మొదటి బహుమతిగా రూ.11,111, రెండవ బహుమతిగా రూ.5,555 ఇవ్వనున్నట్లు తెలిపారు. టోర్నీ ఎంట్రీ ఫీజు రూ.1,100గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు తమ పేర్లను 9963 2218 50, 9701 9598 12, 9959237655 ఫోన్ నెంబర్లలో నమోదు చేసుకోవాలన్నారు.

'స్పందన' సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జగన్మోహన్‌రెడ్డి

మోమిన్‌పేట: స్పందన మానవ హక్కుల సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల జగన్మోహన్‌రెడ్డిని నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు మాణయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో జిల్లా, మండల స్థాయి నూతన కార్యవర్గ కమిటీలను నియమించనున్నట్లు ఆయన తెలిపారు. పాత కమిటీలను పూర్తిగా రద్దు చేసినట్లు ఆయన వెల్లడించారు.

వీఆర్‌ఏకు ఉద్యోగుల ఆర్థికసాయం

పెద్దేముల్: మండల పరిధిలోని గోట్లపల్లి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ బంటు బాలు కొంత కాలంగా లివర్‌కు సంబంధించిన వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ బసంత్‌రెడ్డి, పలువురు వీఆర్‌ఏలు గోట్లపల్లి గ్రామానికి వెళ్లి బాధితుడిని పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, కార్యదర్శి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సమీర్, జిల్లా కో కన్వీనర్ జనార్దన్, వీఆర్‌ఏలు సురేశ్, అంజిలప్ప, వెంకటయ్య, శ్రీనివాస్, రాధ, వెంకటయ్య, రాములు, అనిత తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు చేపడితే యంత్రాలు సీజ్

తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి



పెద్దేముల్: అనుమతి లేకుండా అక్రమంగా సుద్ద తవ్వకాలు, ఎర్రమట్టి తవ్వకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు యంత్రాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని తింసాన్‌పల్లిలో అక్రమ సుద్ద తవ్వకాలు చేపట్టినట్లు ఫిర్యాదులు వచ్చాయని, దానిపై లీజు పత్రాలు, మ్యాప్ పరిశీలించి, రెవెన్యూ, మైన్స్ అధికారులతో ఉమ్మడి సర్వే చేయిస్తామన్నారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టినట్టు తేలితే వారిపై చర్యలు తప్పవన్నారు.

సిరుల 'చామంతి'

పూల సాగులో తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టే పంట చామంతి. పండుగలు, పర్వదినాలతోపాటు సౌందర్య ఉత్పత్తుల్లోనూ ఎక్కువగా వాడుతుంటారు. ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుంది. దీంతో శీతాకాలంలో ఎక్కువగా విరబూసే చామంతి రైతులకు సిరుల వర్షం కురిపిస్తోంది.

అన్ని రకాల నేలలు అనుకూలం

- శ్రమ తక్కువ.. లాభాలెక్కువ



ఎన్కేపల్లిలో సాగు చేసిన చామంతి తోట

మోమిన్‌పేట: మండల పరిధిలో చామంతి పూల సాగు చేపట్టిన రైతు ఇంట లాభాల పంట పండుతోంది. వరుసగా పండుగలు, శుభకార్యాలు ఉండడంతో రైతులకు, వ్యాపారులకూ మంచి గిట్టుబాటు వస్తోంది. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో రైతులు సాధారణ పంటలతో పాటుగా పూల సాగుపై దృష్టి సారించారు. ఇప్పటికే వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సైతం రైతులకు పూల సాగుపై అవగాహన కల్పించారు.

ఏడాదంతా నికర ఆదాయం

తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో లాభాలు పొందాలనుకొనే రైతులకు చామంతి సాగు అనుకూలం. మార్కెట్‌లో డిమాండ్ ఉండే ఈ పూలతో, ఏడాదంతా నికరఆదాయం పొందవచ్చు. అధిక సేంద్రియ పదార్థం ఉన్న అన్ని రకాల నే లల్లోనూ చామంతిని సాగు చేపట్టవచ్చు. మురుగు నీటి వసతి గల ఒండ్రు నేలల్లో అధిక దిగుబడులు వస్తాయి.

30 రోజులు ప్రధానం

చామంతి మొక్కలకు డ్రిప్ ద్వారా నీరు అందించాలి. దీంతో కలుపు బెడద తగ్గుతుంది. మొక్కలు ఒరిగిపోకుండా వెదురు కర్రను ఊతంగా అమర్చాలి. మొక్క దగ్గర మట్టిని రెండు మూడు సార్లు కదిలించడం వల్ల వేరు వ్యవస్థ దృఢంగా మారుతుంది. మొక్కలు నాటిన మొదటి నెలలో వారానికి రెండు నుంచి మూడు నీటి తడులు ఇవ్వాలి. ఆ తర్వాత వారానికి ఒకసారి నీరు అందిస్తే సరిపోతుంది. మొక్క దగ్గర నీరు నిల్వ ఉంటే వేరుకుళ్లు తెగులు వచ్చే ప్రమాదం ఉంటుంది. 20 రోజులకోసారి క్రిమిసంహారక మందులను పిచికారీ చేసుకోవాలి. దీనివల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. నాటిన మొదటి 30 రోజులు మొక్కలు బాగా ఏపుగా పెరిగేలా జాగ్రత్తలు పాటించాలి.

దిగుబడి పెంచేలా..

చామంతి సాగులో తలల కత్తిరింపు ప్రధాన ప్రక్రియ. మొక్కలు 30సెంటీమీటర్లు పెరిగాక తల తుంచేయాలి. దీంతో పక్కకొమ్మలు ఎక్కువగా వచ్చి పూల దిగుబడి పెరుగుతోంది. తలలు తుంచిన తర్వాత నత్రజని, పొటాష్ ఎరువులను అందించడం వల్ల, నాణ్యమైన పూలను పొందవచ్చు. పువ్వుల పరిమాణం పెరగటానికి తలలు కత్తిరించిన 20 నుంచి 25 రోజులకు లీటర్ నీటిలో 50 పీపీఎం జిబ్బరెల్లిక్ ఆమ్లం (50 మిల్లీగ్రాములు) కలిపి పిచికారీ చేయాలి.

సస్యరక్షణ చర్యలు

చామంతి పంటకు తెగుళ్లు, పురుగులు ఆశించే ప్రమాదం ఉంటుంది. దీంతో మొక్కలు చనిపోవడం, దిగుబడి తగ్గడంలాంటి ఇబ్బందులు ఎదురవుతాయి. పూలుపూసే సమయంలో పూలను తొలిచే పురుగులు కనిపిస్తాయి. వీటిని వెంటనే నివారించకపోతే నాణ్యత, దిగుబడి తగ్గుతుంది. సరైన సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా తెగుళ్లు, పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చు.

దిగుబడి

మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరానికి ఎనిమిది నుంచి పది టన్నుల వరకు పూల దిగుబడిని పొందవచ్చు. ఒక పంటకాలంలో 15 సార్లు పూలను కోయవచ్చు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



కుల్కచర్లలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: సంక్షేమ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో, చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో వారు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, డీసీసీ చైర్మన్ మాట్లాడుతూ.. పేదింట ఆడపిల్లల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. పేదల అభ్యున్నతే బీఆర్‌ఎస్ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్ నాయక్, చౌడాపూర్ తహసీల్దార్ అశోక్‌కుమార్, కుల్కచర్ల తహసీల్దార్ రమేశ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, రైతు బంధు మండల అధ్యక్షుడు రాజు, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యానాయక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్ నాయక్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, గిర్దవరులు వెంకటగిరి, ఖాజా, శీనయ్య, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్



మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

తాండూరు: తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు నాయకులు కృషి చేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ తాండూరు నేతలకు సూచించారు. మంగళవారం గాంధీభవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌మహరాజ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌జాదవ్, పార్టీ నాయకులు జనార్దన్‌రెడ్డి, ఉత్తంచంద్ తదితరులు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పరిగి: రంగాపూర్ గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పీర్‌మహ్మద్ మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వేనంబర్ 89లోని 9.39 ఎకరాల ప్రభుత్వ భూమిని రియల్టర్లు కబ్జా చేశారని ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలోని ఎంతో పేదలకు సొంత ఇళ్లు లేవని.. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పేదలకు ఇళ్లస్థలాలు లేదా డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు చంద్రయ్య, రవి, ప్రభు, బసప్ప పాల్గొన్నారు.

ఇటుక బట్టీలపై ఆపరేషన్ ముస్కాన్ టీం దాడి

- ఇద్దరు మైనర్ల గుర్తింపు
- నిర్వాహకులపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..

కుల్కచర్ల: బాలలతో పనులు చేయిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్‌ఐ గిరి హెచ్చరించారు. గతేడాది డిసెంబర్ 30న 'సాక్షి' దినపత్రికలో 'ఇటుక బట్టీల్లో బాల్యం బందీ!' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన ఆపరేషన్ ముస్కాన్ టీం మంగళవారం కుల్కచర్ల మండల పరిధిలోని ఇటుకబట్టీలపై దాడులు నిర్వహించారు. ఘనాపూర్ తదితర గ్రామాలలో ఉన్న ఇటుక బట్టీల దగ్గరకు వెళ్లి పనులు నిర్వహిస్తున్న వారిని పరిశీలించారు. పనులు నిర్వహిస్తున్న ఇద్దరు బాలలు కుసుమ్, శ్రీవాణిని గుర్తించారు. ఈ మేరకు చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ రాములు ఇటుక బట్టీల నిర్వాహకుడు శ్రీనుపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు. కాగా ఆపరేషన్ ముస్కాన్ టీం తమ దాడుల వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం



క్రీడాకారులకు ఆర్థికసాయం అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: క్రీడాకారులకు అండగా ఉంటామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలోని తన నివాసంలో మందిపల్ గ్రామానికి చెందిన క్రీడాకారులకు రూ.15వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు నైపుణ్యం ఉన్నప్పటికీ రాణించేందుకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. వారికి అవసరమైన ప్రతీసారి తాము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింలు, నాయకులు శ్రీను తదితరులున్నారు.

దుష్ప్రచారం చేస్తే ఊరుకోం

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: బైరి నరేశ్‌తో ఉన్న పాత ఫొటోలు, వీడియోలు అడ్డుగా పెట్టుకుని దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంచి పనులు చేస్తే సన్మానిస్తాం, ప్రశంసిస్తాం అదేవిధంగా చెడు పనులు చేస్తే చట్ట ప్రకారం కఠినంగా శిక్షపడేలా చూస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే ఎంతటి వారయిన ఉపేక్షించేది లేదన్నారు. 2017, 2018 మధ్యకాలంలో జన విజ్ఞాన వేదికకు సంబంధించిన బైరి నరేశ్ అనే వ్యక్తి మూఢ నమ్మకాలపై ప్రజలలో అవగాహన కల్పించినందుకు సన్మానించాం. ఇటీవల అయ్యప్ప స్వాములపైన అనుచిత వాఖ్యలు చేసినందుకు అరెస్టు చేశామని చెప్పారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించండి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



బ్రాహ్మణపల్లిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న గోపాల్

దోమ: రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో రైతులు శంకర్, శివకుమార్, హర్య నాయక్ వేరుశనగ పంటలను ఏఈఓ బాబ్యానాయక్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. వేరుశనగ సాగులో రైతులు ఆధునిక విధానాలను పాటిస్తూ అధిక దిగుబడులు పొందాలన్నారు. ప్రతీ రైతు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో వరితో పాటు పెసర, మినుము, జొన్న, నువ్వులు తదితర ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఆయా క్లస్టర్‌ల వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీ..

ఇద్దరి మృతి





వెంకటేశ్‌గౌడ్, లక్ష్మయ్య మృతదేహాలు

బషీరాబాద్: ఎదురెదురుగా వస్తున్న బైక్, ఆటో ఢీకొని ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ ఘటన బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాశీంపూర్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బషీరాబాద్ నుంచి తాండూరు వెళ్తున్న ఆటో, తాండూరు నుంచి బషీరాబాద్ వైపు వస్తున్న బైక్ కాశీంపూర్ నారాయణపూర్ మలుపు వద్ద ఢీ కొన్నాయి. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న కొడంగల్ మండలం టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్(32) తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న దోమ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య(47)ను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుల ఆధార్‌కార్డు ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కమీషన్ ఏజెంట్లకే ధాన్యం విక్రయాలు

సాక్షి కథనానికి స్పందించిన మర్పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం



ధాన్యం బీట్లు వేస్తున్న కమీషన్ ఏజెంట్

సాక్షి ఎఫెక్ట్..

మర్పల్లి: మర్పల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ముఖద్వారం వద్ద చిల్లర కాంటాలు వేస్తున్నారని గతేడాది డిసెంబర్ 28న 'సాక్షి' దినపత్రికలో 'నిర్వహణ అస్తవ్యస్తం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మార్కెట్ కమిటీ చైర్మన్ డిసెంబర్ 30న పాలకవర్గం, కమీషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. చిల్లర కాంటాలను తొలగించాలని తీర్మాణం చేశారు. దీంతో మంగళవారం మార్కెట్లో చిల్లర కాంటాలు వేయలేదు. నేరుగా కమీషన్ ఏజెంట్లు ధాన్యం బస్తాలకు బీట్లు వేశారు. ఇందులో కందులు క్వింటాల్‌కు మొదటి రకం రూ.7,250, రెండో రకం రూ.6,800. వామ క్వింటాల్ మొదటి రకం రూ.14,500, రెండో రకం రూ.12వేలు పలికినట్లు కమీషన్ ఏజెంట్లు తెలిపారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

పట్టించుకోని అధికారులు

- వాహనదారులకు ఇక్కట్లు



కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు ప్రయాణించడంతో పగుళ్లు ఏర్పడిన దిర్సంపల్లి-కొండాయపల్లి రోడ్డు

దోమ: రహదారుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తుంటే.. అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. ఏడాది గడువకముందే రోడ్లన్నీ కంకర తేలి, పగుళ్లు ఏర్పడుతున్నాయి. కేజ్‌వీల్స్‌తో తిరిగే ట్రాక్టర్ల వలనే రోడ్లు ధ్వంసం అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. వానకాలం, యాసంగి సీజన్‌లో ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో బీటీ రోడ్డుపై ప్రయాణిస్తుండడంతో రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని ప్రజలు మండి పడుతున్నారు.

నిబంధనలకు పాతర

మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలున్నాయి. పరిగి నుంచి మహబుబ్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డుతో పాటు పరిగి మండలం గడిసింగపూర్ నుంచి గండీడ్ మండలం రంగారెడ్డిపల్లి వెళ్లే ప్రధాన రోడ్లు దోమ మండలంలో ఉన్నాయి. వీటికి అనుబంధంగా ఆయా గ్రామాలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రూ.కోట్లు వెచ్చింది బీటీ రోడ్లు వేసింది. అయితే ప్రతీ సీజన్‌లో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు పొలాలకు వెళ్తుండడంతో రోడ్లు కంకర తేలి, పగుళ్లు ఏర్పడి ధ్వంసమవుతున్నాయి. కేజ్‌వీల్స్‌కు పట్టీలు లేకుండా రోడ్లపై ప్రయాణించకూడదనే నిబంధన ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చర్యలు శూన్యం

రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు ప్రయాణిస్తే సదరు ట్రాక్టర్ యజమానిపై ఆర్‌అండ్‌బీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేయాలి. కానీ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు అలాంటి కేసు ఒక్కటీ నమోదవ్వలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కేజ్‌వీల్స్ వల్లే రోడ్లు ధ్వంసమవుతున్నాయని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి రోడ్లు వేస్తుంటే కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు ప్రయాణించి ధ్వంసం అవుతున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ ప్రమాదాలు చోటుచేసుకుంటాయని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కేశవులు, కొండాయపల్లి

కేసులు నమోదు చేస్తాం



గ్రామాలలో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో రోడ్లపై వెళితే యజమానులపై కేసులు నమోదు చేస్తాం. కేజ్‌వీల్స్‌కు పట్టీలు ఏర్పాటు చేసుకోవాలి. ఎవరైనా గమనిస్తే మాకు సమాచారం ఇవ్వాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం గ్రామ పంచాయతీల్లో చాటింపు వేయించి అవగాహన కల్పించి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– విశ్వజన్, ఎస్‌ఐ, దోమ

ట్రాక్టర్లు సీజ్ చేస్తాం



రోడ్ల భద్రతపై గ్రామస్తులు దృష్టిసారించాలి. కేజ్‌వీల్స్‌తో ప్రయాణించి రోడ్లు ధ్వంసం చేస్తున్నారనే సమాచారం వస్తోంది. అలాంటి ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తాం.

– షాహిదా బేగం, తహసీల్దార్, దోమ

స్కూల్ బస్సు బీభత్సం

- నాలుగు బైక్‌లను ఢీకొట్టిన వైనం
- బొంగ్లూర్ గేటు సమీపంలో ఘటన
- పిల్లలు సురక్షితం



ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటు స్కూల్ బస్సు మంగళవారం రాత్రి బీభత్సం సృష్టించింది. త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. విద్యార్థులు బస్సులోనే ఉండగా డ్రైవర్ నిర్లక్ష్యం వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వనస్థలిపురం నాగార్జున స్కూల్‌కు చెందిన బస్సు రాత్రి 7 గంటలకు విద్యార్థులతో బొంగ్లూర్ నుంచి ఎంపీపటేల్‌గూడకు బయలుదేరింది. బొంగ్లూర్‌లోని ఓ మెకానిక్ దుకాణం ముందు ఆపిన నాలుగు వాహనాలకు బస్సు ఢీ కొట్టింది. ఆ ప్రాంతంలో పాదచారులు, ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. అంతకు ముందే రోడ్డు మీద ఆటోను ఢీ కొట్టినట్లు ప్రజలు తెలిపారు. డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేకపోవడం వల్లే ఇలా జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

కారును ఢీకొట్టిన బస్సు

ముగ్గురికి గాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్: ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని వనస్థలిపురానికి చెందిన పడాల అనిల్, అతని స్నేహితులు శ్రీధర్, నవీన్‌కుమార్ కారులో తిరుపతికి వెళ్లి మంగళవారం హైదరాబాద్‌కు బయలు దేరారు. అబ్దుల్లాపూర్‌మెట్ వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సు కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.